నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పోచారం: సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్‌కుమార్ ప్రకటించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాజీవ్ గృహకల్పలోని అన్ని బ్లాకులు, ఆర్ఎస్ఆర్ హైట్స్, మయూరి డెవలపర్స్, సాయినగర్, ఎమరాల్డ్ హైట్స్, సూర్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నవోదయ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన



ప్రతాపసింగారంలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

పోచారం: జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఏర్పాటు చేసేందుకు గురువారం అధికారులు స్థల పరిశీలన చేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారం పరిసరాల్లో సర్వేనెంబర్ 378లోని ప్రభుత్వభూమిని పరిశీలించారు. జవహర్ నవోదయ కన్‌స్ట్రక్షన్ జనరల్ మేనేజర్ జీవీరెడ్డి, సిద్దిపేట జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారిని విజయకుమారి, ఘట్‌కేసర్ తహసీల్దార్ డీఎస్ రజిని తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి



కీసర: విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలని రాక్‌ఉడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ అయ్యంగార్ అన్నారు. ఐఐటీ జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్‌లో 98.4 సాధించిన గుజ్జుల నందీశ్వర్‌రెడ్డిని నాగారంలోని రాక్‌ఉడ్స్ స్కూల్‌లో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టుదలతో కృషి చేస్తే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చనడానికి నందీశ్వర్ నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. సీఈఓ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ పద్మ అయ్యంగార్ తదితరులు నందీశ్వర్‌ను అభినందించారు.

కనుల పండువగా మల్లన్న జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలో భ్రమరాంబిక మల్లిఖార్జునస్వామి జాతర గురువారం కనుల పండువగా జరిగింది. ఉదయం అగ్నిగుండాలు. సాయంత్రం బండ్ల బోనాలను ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు, మహిళలు, సమీప గ్రామాల్లోని ప్రజలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్ !

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నాడని ఆరోపణలు

కాప్రా/కుషాయిగూడ: రెవెన్యూ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి లక్ష్మణ్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. కాప్రా మండలం 199 సర్వే నంబర్‌లో 15 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గత రెండ్రోజుల క్రితం పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు ప్రారంభించారు. ఆ సమయంలో మంత్రి లక్ష్మణ్ అనే వ్యక్తి ఇది తమ భూమి అని రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా వారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి లక్ష్మణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం కాప్రా మండల తహసీల్దార్ సుచరిత ఎదుట అతడిని హాజరుపరిచారు. దీంతో సదరు వ్యక్తి గురించి తహసీల్దార్ ఆరా తీయడంతో ఇప్పటికే అతనిపై 10 పాత కేసులు ఉన్నట్లు గుర్తించామని తహసీల్దార్ వివరించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా చేశారనే కేసులు కూడా అతడిపై ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిసి అతడిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేయాలని కోరినట్లు తహసీల్దార్ వివరించారు.

కీసర చరిత్రకు మోక్షమెప్పుడో ?

నగరానికి చేరువలో ప్రఖ్యాత శైవ క్షేత్రం

నగరానికి చేరువలో చక్కటి ప్రకృతి రమణీయత కలిగి ఎంతో చరిత్రాత్మక విశిష్టత కలిగిన ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని ఆర్కియాలజీ మ్యూజియానికి ఆలన–పాలన లేక శిథిలావస్థకు చేరుకుంది.

- ప్రస్తుతం కళావిహీనంగా పిచ్చిమొక్కలతో..
- శిథిలావస్థలో ఆర్కియాలజీ మ్యూజియం
- విష్ణుకుండినుల రాజధానిగా పాలించినట్లు ఆధారాలు



శిథిలావస్థలో ఆర్కియాలజీ మ్యూజియం

కీసర : పురావస్తుశాఖ ఆధ్వర్యంలో గతంలో ఇక్కడ జరిపిన తవ్వకాల్లో క్రీ.శ 4–5 శతాబ్ద కాలంలో ఆంధ్రదేశాన్ని పాలించిన విష్ణుకుండినుల రాజధానిగా ఈ ప్రాంతం విరసిల్లినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని చరిత్ర కారులు చెబుతున్నారు.

1000కి పైగా యాగాలు..

ఈ వంశానికి చెందిన రెండో మాధవవర్మ, అశ్వమేదయాగం, 1000 పైగా ఇతర యాగాలు నిర్వహించి నర్మదానది వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేసినట్లు పురావస్తుశాఖ గుర్తించింది.

బయటపడిన దేవతా విగ్రహాలు..

కీసరగుట్టలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తవ్వకాల్లో బయటపడిన విష్ణుకుండినుల రాజప్రసాదాలు, దేవాలయం, వారి కాలంలో వాడిన వివిధ వస్తువులు, పలు దేవుళ్ల విగ్రహాలు బయటపడ్డాయి.

పురావస్తు శాఖ ఆధీనంలోకి..

ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఈ ప్రాంతం విశిష్టతో పాటు తవ్వకాల్లో లభించిన వాటిని భవిష్యత్‌తరాలు తెలుసుకునేలా ఈ ప్రాంతం చుట్టూ పురావస్తుశాఖ ఆధీనంలోకి తీసుకుంది. రాజప్రసాదాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మించింది.

మ్యూజియం ఏర్పాటు..

పురావస్తు జరిపిన తవ్వకాల్లో బయటపడిన ఆనాటి వివిధ వస్తువులను భద్రపరిచేందుకు ఆర్కియాలజీ మ్యూజియం కుడా నిర్మించి గతంలో కీసరగుట్టకు వచ్చే యాత్రికుల సందర్శనకు అనుమతించారు.

పిచ్చిమొక్కలకు నిలయంగా..

కొన్నేళ్ల నుంచి ఆర్కియాలజీ మూతపడటంతో కీసరగుట్టకు వచ్చే యాత్రికులకు, విష్ణుకుండినుల చరిత్ర అలనాటి కట్టడాలను, విష్ణుకుండినుల పాలన కాలంలో వాడిన వస్తువులు, దేవతామూర్తుల విగ్రహాలను సందర్శించే అవకాశం లేకుండా పోయింది. మ్యూజియం వద్ద ఎలాంటి ఆలనాపాలన లేని కారణంగా రాజప్రసాదాల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మ్యూజియం భవనం కుడా శిథిలావస్తకు చేరుకుంది.

ప్రభుత్వమే పరిరక్షించాలి..

ఇక్కడ లభించిన వివిధ వస్తువులను పురావస్తుశాఖ ప్రధాన కార్యాలయానికి తరలించారు. దీంతో ఇక్కడికి వచ్చే యాత్రికులకు ఇక్కడి చరిత్ర తెలుసుకోవడానికి వీలు లేకుండా పోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, పురావస్తుశాఖ అధికారులు స్పందించి ఆర్కియాలజీ మ్యూజియానికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మ్యూజియాన్ని తీర్చిదిద్దడంతో పాటు వస్తువులను కుడా అందుబాటులో ఉంచి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు వచ్చే యాత్రికుల సందర్శనకు అనుమతించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

మ్యూజియాన్ని అందుబాటులోకి తీసుకురావాలి



కీసరగుట్టకు వచ్చే యాత్రికులు ఇక్కడి చరిత్రను తెలుసుకునేందుకు వీలుగా పురావస్తుశాఖ గతంలో నిర్మించిన మ్యూజియానికి మరమ్మతులు చేపట్టి విష్ణుకుండినుల పాలన నాటి వస్తువులను మ్యూజియంలోనే భద్రపరిచి యాత్రికులను అనుమతించాలి.

– బండారి శ్రీనివాస్‌రెడ్డి, కీసర

విద్యార్థిని మృతికి కారణమైన స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఫర్నిచర్ ధ్వంసం చేసిన విద్యార్థి సంఘాలు



స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్‌రూరల్: పాఠశాల ఫీజు కట్టలేదని విద్యార్థినితో ప్రిన్సిపాల్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాలు కోల్పోగా.. ఈ ఘటనకు కారణమైన పాఠశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే ఫీజు కట్టలేదని తోటి విద్యార్థుల ముందు విద్యార్థిని అఖిలతో ప్రిన్సిపాల్ అసభ్యంగా ప్రవర్తించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి బుధవారం సాయంత్రం మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా గురువారం స్కూల్ ఎదుట బీజేపీ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థి మృతిచెందిన విషయం తెలుసుకుని గురువారం పాఠశాలకు సెలవు ప్రకటించడంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘాలు పాఠశాలలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ, మాజీ కౌన్సిలర్ ఉమానాగరాజు, ఏబీవీపీ,ఎస్ఎఫ్ఐ నాయకులున్నారు.

ఘనంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే

మేడ్చల్: మేడ్చల్, అత్వెల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా 'ఇంగ్లిష్ లాంగ్వేజ్‌డే' ను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కవయిత్రి, మొట్టమొదటి మహిళా గవర్నర్ సరోజినీనాయుడు పుట్టినరోజు సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్‌డేను జరిపారు. విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు, ఇంగ్లిష్ టీచర్ నవీన్, స్వరూపారాణి, వసీం, మంజుల, రాంబాబు, రంగారావు, ప్రభాకర్, రీతు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ




విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

పోచారం: కొర్రెముల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలతో పాటు రికార్డులను డీఈఓ విజయకుమారి పరిశీలించారు. గురువారం పాఠశాలలో తనిఖీలు నిర్వహించిన ఆమె ఉపాధ్యాయుల పనితీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పదోతరగతి విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం ఉదయం, సాయంత్రం వేళల్లో స్పెషల్ క్లాసులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

దివ్యాంగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కాప్రా: దివ్యాంగులకు క్యాడర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను ఇస్తున్నారు. 'అసోసియేషన్ పర్సన్ విత్ డిజేబిలిటీ బెంగళూరు' వారి సహకారంతో శిక్షణను అందిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ హరిబాబు తెలిపారు. ఈసీఐఎల్‌లోని తమ సంస్థలో 45 రోజుల పాటు కంప్యూటర్ శిక్షణ అందించి, ఉద్యోగం కల్పించేలా కృషి చేస్తామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని, దూరప్రాంతాల వారికి ఉచితంగా హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నట్లు ప్రకటించారు. మరిన్ని వివరాలకు 9030777102, 6303605360.

ఎన్యుమరేటర్ల వేతనాల్లో జాప్యం !



- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- ప్రభుత్వం నుంచి రాలేదంటున్న అధికారులు

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్ల, సూపర్‌వైజర్లుగా పనిచేసిన వారికి ప్రభుత్వం నుంచి వేతనం ఇవ్వడంలో జాప్యం చేస్తోంది. 2024 నవంబర్ మొదటి వారం నుంచి డిసెంబరు మొదటి వారం వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేను చేపట్టింది. నగర పాలక సంస్థ పరిధిలో 327 మంది ఎన్యుమరేటర్లు, 32 మంది సూపర్‌వైజర్లు, 150 మందిని డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా తీసుకున్నారు. డేటా ఎంట్రీ పనులు పూర్తికాగానే వారికి వేతనం అందజేశారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు రెండు నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు వేతనం ఇవ్వలేదు. దీంతో పలువురు రోజూ నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చి అధికారులను కలుస్తున్నారు. తమ పనిపూర్తి కాగానే వేతనం ఇస్తామని అధికారులు చెప్పారని, రెండు నెలలు దాటినా ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేదని మహిళా ఎన్యుమరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని చెప్పారన్నారు. వేతనాలు చెల్లించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గైర్హాజరు నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్: వాయిదాల ప్రకారం హాజరుకాని నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. చార్జ్‌షీటులో ముద్దాయిలుగా ఉన్న పాశం యాదిరెడ్డి, పాశం పద్మపై మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఐదో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శిరీష నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

అతివేగంతో కారు బీభత్సం..

పలువురికి తీవ్ర గాయాలు

శామీర్‌పేట : అతివేగంతో వచ్చిన ఓ కారు బీభత్సం సృష్టించిన ఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. మూడు చింతలపల్లి మండల కేంద్రం నుంచి కేశవరం గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో ఎల్లమ్మ దేవాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా ట్రాన్స్‌కో సిబ్బంది, రైతులు రోడ్డు పక్కన నిలబడి పనితీరును పరిశీలిస్తున్నారు. అదే సమయంలో మూడు చింతలపల్లి నుంచి కేశవరం వైపు వెళ్తున్న మహీంద్ర ఎక్స్‌యూవీ300 కారు డ్రైవర్ కారుతో అతివేగంగా వచ్చి 5 ద్విచక్ర వాహనాలు, పక్కన నిలబడి ఉన్న రైతులు, విద్యుత్ సిబ్బందిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. కారును వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. గుజ్జ రాము, మహేష్ అనే వ్యక్తులతో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను అల్వాల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన శత్రుగన్‌కుమార్ శర్మ (30), రాహుల్‌కుమార్‌లు కార్పెంటింగ్ పని చేస్తూ బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా గురువారం రాత్రి సమయంలో బాలాజీనగర్ నుంచి తూంకుంటకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. హకీంపేట నీసా వద్ద బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా.. బైక్ అదుపుతప్పి కింద పడటంతో శత్రుగన్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాహుల్‌కుమార్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షబ్బే బరాత్‌కు ఏర్పాట్లు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలో షబ్బేబరాత్ ఉత్సవాల సందర్భంగా ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ తెలిపారు. గురువారం చిలుకానగర్ డివిజన్ పరిధిలోని ఖబ్రస్తాన్‌లో కమిటీ అధ్యక్షులు అబ్బుబాయ్ విజ్ఞప్తి మేరకు ఖబ్రస్తాన్‌లో పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో పాటు వీధిదీపాలను సైతం ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

విద్యాశాఖ అధికారులు కనిపించడం లేదని..

ఖాళీ కుర్చీకి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి



మేడ్చల్ విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మేడ్చల్: మండలంలో విద్యాశాఖ అధికారులు కనిపించడం లేదని మేడ్చల్ పోలీసులకు ఎస్ఎఫ్ఐ నేతలు గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం మేడ్చల్ మండల విద్యాశాఖ కార్యాలయంలో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. మేడ్చల్ మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఫీజు కట్టలేదని, విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఇప్పటి వరకు విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు. ఓ ఇంటర్నేషనల్ పాఠశాల కూడా స్కూల్ ఫీజు కట్టలేదని విద్యార్థులను నిలబెట్టారని, దీనిపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చలనం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రైవేటు పాఠశాలల ఆగడాలను కట్టడి చేయాలని, లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కోమటికుంటలో హైడ్రా కూల్చివేతలు

శామీర్‌పేట్: మేడ్చల్‌జిల్లా, దేవరయాంజాల్‌లో గురువారం సాయంత్రం హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. హైదరాబాద్ నగర శివారైన తూంకుంట మున్సిపాలిటీ, దేవరయాంజాల్‌లోని కోమటికుంట 11 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కాగా ఈ కుంటలో సుమారు రెండెకరాలు కబ్జా చేసి ప్రకృతి కన్వెన్షన్, ప్రకృతి రిసార్ట్స్ నిర్మించారనే ఆరోపణలున్నాయి. కాగా ఈ నిర్మాణాలపై హైడ్రా అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ జరిపిన అధికారులు గురువారం రిసార్ట్స్, ఫంక్షన్‌హాళ్లను కూల్చివేశారు.

హైకోర్టు ఆదేశాలతో...

కోమటికుంటను ఆక్రమించి రిసార్ట్స్, కన్వెన్షన్ హాల్స్ నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదు రావడంతో విచారణ చేసి నోటీసులు ఇచ్చింది. దీంతో హైడ్రాను సవాల్ చేస్తూ రిసార్ట్స్ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నివేదిక ఆధారంగా కూల్చివేయాలంటూ కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ క్రమంలో తామే తొలగిస్తామని, 30 రోజులు గడువు కావాలని సదరు ప్రతినిధులు కోర్టును కోరారు. గడువు ముగిసినా తొలగించకపోవడంతో గురువారం హైడ్రా రంగంలోకి దిగింది.



దేవరయాంజాల్‌లో కూల్చివేసిన కన్వెన్షన్



ఫంక్షన్‌హాల్, ప్రకృతి రిసార్ట్

మత్స్యకారులకు గుర్తింపు కార్డుల అందజేత



ఐడీ కార్డులను అందజేస్తున్న మత్స్యకారుల సంఘం జిల్లా చైర్మన్ మన్నే రాజు

మేడ్చల్‌రూరల్: మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేస్తానని మేడ్చల్ జిల్లా మత్స్యకారుల సంఘం చైర్మన్ మన్నే రాజు అన్నారు. మేడ్చల్‌లోని మత్స్యశాఖ భవనంలో జరిగిన గుర్తింపుకార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన మత్స్యకారులకు చైర్మన్, ఫిషరీస్ అధికారి సుకీర్తి గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ గుర్తింపు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలకు అర్హులని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ముదిరాజ్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్‌ముదిరాజ్, మున్సిపల్ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు హనుమంత్, రమేష్, మోహన్, నాగరాజు, నవీన్, జంగం, బండారి సూరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల యజమానుల ఆందోళన

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్న పోలీసులు



లారీల యజమానులతో మాట్లాడుతున్న పోలీసులు

కుషాయిగూడ: ఇసుక తరలింపులో ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఇసుక లారీల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వతీరుపై గురువారం వారు చక్రిపురం చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలతో మైనింగ్, పోలీసు అధికారులు టిప్పర్లతో ఇసుక రవాణా చేయొద్దని ఆదేశిస్తున్నారని తెలిపారు. చిన్న చిన్న వీధుల్లోకి లారీలతో ఇసుక సరఫరా చేయడం ఎలా సాధ్యమవుతుందన్నారు. కొంత మేరకే ఇసుక అవసరమైన వారికి టిప్పర్లతో సప్లై చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ తాజా నిబంధనలతో ఇసుక లారీల యజమానులు వీధిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రభుత్వ తీరుతో గత రెండ్రోజులు ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఇలాగే కొనసాగితే తమ జీవనోపాధి కోల్పోవడంతో పాటు బ్యాంకుల్లో రుణాలు కూడా చెల్లించలేని పరిస్థితులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనల మేరకే సప్లై చేయాలి..

లారీ యజమానుల ఆందోళన విషయం తెలుసుకున్న కుషాయిగూడ, చర్లపల్లి ఇన్‌స్పెక్టర్లు భాస్కర్ రెడ్డి, రవికుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరాజు చక్రిపురం చేరుకుని ఇసుక లారీల యజమానులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక సప్లై చేయాలని సూచించారు. అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టిప్పర్లతో ఇసుక తరలింపు విషయంలో రెవెన్యూ, మైనింగ్ అధికారులతో మాట్లాడుకోవాలన్నారు. ఇసుక లారీల యజమానులు రాంచందర్‌గౌడ్, బలవంతరెడ్డి, శివారెడ్డి, మల్లేష్, దిలీప్‌రెడ్డి, బాలనరసింహ, ప్రభాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



రవికుమార్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మల్లాపూర్: కుంభమేళా నుంచి తిరిగి వస్తూ.. జబల్‌పూర్ రోడ్డు ప్రమాదంలో నాచారం కార్తికేయనగర్‌కు చెందిన సురకంటి మల్లారెడ్డి, బోరంపేట్ సంతోష్‌కుమార్, రాంపల్లి రవికుమార్, రాఘవేంద్రనగర్‌కు చెందిన సోమావరం శశికాంత్, డ్రైవర్ రాజులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల అంత్యక్రియలు పూర్తికాగా.. కుంభమేళా నుంచి వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ నేరుగా నాచారం వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతూ.. తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్తికేయ నగర్‌కు శ్రీరామ్ బాలకిషన్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవీన్‌కుమార్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు గూడురు శైలేష్‌రెడ్డి, బీజేపీ నేతలు రాగిరి మోహన్ రెడ్డి, నర్సింగ్‌రావు, ప్రకాష్, సత్యనారాయణ, రవి నాయక్, గోపి తదితరులున్నారు.

నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. కృష్ణానగర్ కాలనీలో తాగునీటి మెయిన్ పైపులైన్ మరమ్మతు పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్‌వర్క్స్ చీఫ్ మేనేజర్ నాగేందర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సతీష్, ఏఈ వేణుగోపాల్, స్థానిక నేతలు ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, నిసార్ అహ్మద్‌గోరి తదితరులు పాల్గొన్నారు.